ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం | 26 అక్టోబరు, 2025 | పేజీలు :08

## పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో ఘనంగా రక్తదానం శిబిరం




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని కరీంనగర్ పోలీసు ట్రైనింగ్ కళాశాల (పిటిసి)లో శనివారం గివ్ బ్లడ్ సేవ్ లైఫ్ నినాదంతో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్ సిపి గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.పిటిసిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కళాశాల అధికారులను సిపి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ ఎస్‌పి ఎం.పిచ్చయ్య మాట్లాడుతూ ఈ క్యాంపు ద్వారా సేకరించిన మొత్తం 80 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ సెంటర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ డిఎస్పీ బి.మోహన్, బి.విజయపాల్‌రెడ్డి, సిహెచ్ మల్లిఖార్జున్, బి.గంగాధర్, ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, బృంది పాల్గొన్నారు.

# అసమర్థ మోదీ ప్రభుత్వం గద్దె దిగాలి

### ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్




**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** నిర్మల్ పట్టణంలో సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ పద్మ కుమారి అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్.విలాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కామ్రేడ్ విలాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. 1991 నుండి పదవీ విరమణలు మాత్రమే తప్ప కొత్త నియామకాలు లేవని అన్నారు. ప్రతి యేడాది కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీ యూస్ లేకుండా పోయిందని, నిరుద్యోగం పెరిగిందని పేర్కొన్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, బంగారం ధర రూ.1,25,000 దాటిందని అన్నారు. అసమర్థ మోదీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆయన డిమాండ్ చేశారు. ఐక్య పోరాటాల ద్వారానే మన హక్కులు సాధించుకుంటామని స్పష్టం చేస్తూ, నిర్మల్ జిల్లాలో ఏఐటీయూసీ అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఆర్టీసీ భవన నిర్మాణము వంటి అన్ని రంగాలలో విస్తరించి బలమైన శక్తిగా ఎదిగిందని తెలిపారు. ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 31న జిల్లా వ్యాప్తంగా పతాకావిష్కరణ చేసి అలంకరించి ఘనంగా జరపాలని కోరారు. అదేవిధంగా కౌన్సిల్ సభ్యులు జిల్లాలోని అన్ని రంగాలలో యూనియన నిర్మాణము చేయాలని సూచించారు. ఈరోజు కౌన్సిల్ తీర్మాణం ప్రకారం నిర్మల్ జిల్లా ఏఐటీయూసీ జిల్లా మహాసభలు డిసెంబర్ 21న నిర్వహించాలని నిర్ణయించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శ్రీనివాస్ చారి మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. అంగన్వాడీలకు వేసవి సెలవులు, మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు, గౌరవ వేతనాలు, పెయింటర్ల పని భద్రత, మేస్త్రీల పని భద్రత గురించి పోరాటం చేశామని వివరించారు. ఏఐటీయూసీ దేశంలోనే మొదటి కార్మిక సంఘమని,దేశంలోని కార్మికులకు అనేక చట్టాలు సాధించిందని అన్నారు. 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 31న విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కామ్రేడ్ ఎస్.ఎన్.రెడ్డి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కామ్రేడ్ పి.పద్మ కుమారి, జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ భుక్య రమేష్ నాయక్, కామ్రేడ్ రమాదేవి, రాథోడ్ పుండలిక్, జాదవ్ శంకర్ తదితరులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి(మాజీ సీపీఐ జాతీయ అధ్యక్షుడు), ఇటీవల చనిపోయిన కార్మికులు, కర్నూలులో బస్సు ప్రమాదంలో చనిపోయిన వారికి సంతాపం ప్రకటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# అర్హులకు సదరం సర్టిఫికెట్ అందించాలి




### ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రమం తప్పకుండా సదరం శిబిరాలు నిర్వహించాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశించారు. సదరం శిబిరాల నిర్వహణ, యూడీఐడీ కార్డుల జారీ తదితర అంశాలపై అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓలు, అధికారులతో సెర్ప్ సీఈవో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా సదరం శిబిరాల నిర్వహణ, పెండింగ్ అప్లికేషన్ల వివరాల పై ఆరా తీశారు.సెర్ప్ సీఈవో మాట్లాడారు. సదరం శిబిరాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, దరఖాస్తుదారులకు సమాచారం చేరవేయాలని, వారు ఆబ్సెంట్ కాకుండా చూసుకోవాలని సూచించారు. అర్హులైన వారికే సదరం సర్టిఫికెట్ అందించేలా చూడాలని ఆదేశించారు. అన్ని వైద్య కళాశాలలు, దవాఖానల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. భవనాలు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాల కోసం నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం అవసరమైన వైద్యులను నియమించుకోవాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి వెంటవెంటనే నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైకల్య నిర్ధారణ పరీక్షలు, యూడీ ఐడీ కార్డుల జారీలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మొదటి స్థానంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా రెండో స్థానంలో ఉందని తెలిపారు.

**జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తాం..**

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైకల్య నిర్ధారణ పరీక్షల కేంద్రాల్లో వసతులు కల్పిస్తామని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. శిబిరాల సమాచారం దరఖాస్తు చేరవేస్తామని వివరించారు. అప్లికేషన్లు పెండింగ్ లో లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ శేషాద్రి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, డీపీఎం వంగ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### వంగర ఘటనపై

# సమగ్ర దర్యాప్తు ఆదేశించాం

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో గల హస్టల్‌లో హుజురాబాద్ మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన శ్రీ వర్షిత అనే బాలిక ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని, దీనిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణకు ఆదేశించారని, నివేదిక రాగానే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాలిక మృతదేహాన్ని అడ్డుపెట్టుకుని కౌశిక్ రెడ్డి చేసిన దర్నా చూస్తే సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, పాప చనిపోయి పెట్టెడు దుఃఖంలో తల్లిదండ్రులు ఉంటే దీన్ని కౌశిక్ రెడ్డి అదునుగా తీసుకుని పోస్టుమార్టం అయిన తరువాత బాలిక మృతదేహాన్ని అంబేద్కర్ చౌరస్తాలో పెట్టి దర్నా చేయడం నీచమైన రాజకీయమని అన్నారు. అప్పుడు ఓట్ల కోసం సెంటిమెంట్ వాడుకున్నాడని, ఇప్పుడు శవ రాజకీయాలను కౌశిక్ రెడ్డి ప్రోత్సాహిస్తున్నాడని ఇది సిగ్గు చేటని అన్నారు. కౌశిక్ రెడ్డి అంతలా సహాయం చేయాలని అనుకుంటే నేరుగా అధికారులతో మాట్లాడి సహాయం చేయాలి కానీ ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచిది కాదని అన్నారు.



# ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రి పెరుగుతున్న చెట్లు



**ప్రజాపక్షం/తంగళ్ళపల్లి :** తంగనపల్లి మండలం మండేపల్లి గ్రామంలోని ఓ సర్వే నంబర్ లో గత కొన్ని నెలలుగా భూకబ్జాదారుడు రాత్రి పూట దున్నడం, భూమిలో రాత్రికి రాత్రి చెట్లు పెరగడంతో గ్రామస్తులు శనివారం రోజున రెవిన్యూ అధికారులకు వివరించగా ఆర్ ఐ దినేష్, జిపిఓ వేణు రెవెన్యూ సిబ్బంది శనివారం రోజున పరిశీలించారు. గ్రామస్తుల అభిప్రాయం ప్రకారం భూమి రెవెన్యూ కి చెందాలి లేకుంటే గ్రామ అభివృద్ధి కోసం వద్ల బీటుకు అందజేయాలని వివరించారు. భూమికి సంబంధించిన పత్రాలు ఉంటే రాత్రి పూట దున్నడమేంటి రాత్రి పూట చెట్లు పెట్టడం ఏంటని ఆరోపించారు.ఇప్పటికే గ్రామంలోని 377 సర్వే నంబర్ లో 360 ఎకరాల భూమి ప్రభుత్వం అధినం చేసుకుందని మిగిలిన భూమి ఇలాంటి భూకబ్జాదారుల చేతిలోకి వెళ్తుందని, గ్రామంలో పశువులు మేకలు మేయడానికి ఉపయోగ పడుతుందని అనుకున్నామన్నారు. గ్రామానికి భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని క్రీడా ప్రాంగణానికి అందజేయాలని కోరారు.

## మున్నూరు కాపు పటేల్ సంఘం మహిళా కమిటీల నియామకం



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్నూరు కాపు నిత్యన్న దాన సత్రంలో రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, రాష్ట్ర జిల్లా, పట్టణ మహిళా కమిటీలను నియమించారు. ఈ కమిటీలలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులుగా ద్వారక శ్రీదేవి, సెక్రెటరీ ముప్పిడి సునంద, జిల్లా మహిళా సంఘం గౌరవ అధ్యక్షులు రామతీర్థపు మాధవి, జిల్లా అడ్వైజర్ కమిటీ చైర్మన్ నామాల ఉమా, జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, జిల్లా ఉపాధ్యక్షురాలు కొండ పావని, తోపాటు పట్టణ గౌరవాధ్యక్షులు సగ్గు పద్మ, అధ్యక్షురాలు రామతీర్థపు రామా, ఉపాధ్యక్షులు గోలి రమ, తో పాటు రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధికార ప్రతినిధిగా ముప్పిడి శ్రీనివాస్, పట్టణ, జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఆధ్వర్యంలో నియామక పత్రాలను అందజేసి సర్వత్రో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, 33 శాతం మహిళా రిజర్వేషన్ కు సాధించుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో మున్నూరు కాపు మహిళలు ముందుండాలని కోరారు. త్వరలో మున్నూరు కాపు పటేల్ సంగం గర్జన సభ నిర్వహిస్తామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు పట్టణ అధ్యక్షులు ఇప్పపూల అజయ్, జిల్లా యూత్ అధ్యక్షులు మారం కుమార్, గౌరవ అధ్యక్షులు నామాల పోశెట్టి, వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమరయ్యతోపాటు మహిళలు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్ష

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మల్లాపూర్ సిరిపూర్ చిట్టాపూర్ ముత్యంపేట ఇబ్రహీంపట్నం యామాపూర్ తిమ్మాపూర్ సహకార సంఘాల కార్యదర్శులతో జిల్లా సహకార సంఘ అధికారి మాదాసు సత్యనారాయణ సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే వరి ధాన్యం కేంద్రాల నిర్వహణపై సంఘ కార్యదర్శులు, నిర్వాహకులు ట్యాబ్ ఆపరేటర్ల తో సమీక్షించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ ఇన్స్పెక్టర్ నిజాముద్దీన్,పిఎసిఎస్ కార్యదర్శులు పాదం భూమేష్ బొజ్జ రమేష్ మామిడి రాజేశ్వర్ రెడ్డి కొత్తపల్లి రవి తేజ, పండుగ సంపత్ నేమూరి మహేందర్, నిర్వాహకులు,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు రిపోర్టర్లపై కేసు నమోదు



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు రిపోర్టర్లపై కేసు నమోదు చేశారు. మొదట అరెస్టయిన ఒకరిని గతంలో రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న మరో వ్యక్తిని కూడా పట్టుకుని శనివారం రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం, అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మేల మహిపాల్ అనే ఒగ్గు కళాకారుడు గంగాదేవి, సపుడలమ్మ పూజలు చేస్తూ మూలికల వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. వేములవాడకు చెందిన తొగరి కరుణాకర్ అనే జర్నలిస్ట్ 11–10–2025న మహిపాల్‌కు ఫోన్ చేసి, వేములవాడకు రాకపోతే నీపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేస్తా అంటూ బెదిరించాడు. భయంతో వేములవాడకు వచ్చిన మహిపాల్‌ను కలిసిన కరుణాకర్, నీ గురించి, నీ కుటుంబం గురించి మా పేపర్‌లో రాస్తా అంటూ మళ్లీ బెదిరించాడు. తర్వాత రోజు కరుణాకర్ ఫోన్ చేసి, ఒక వ్యక్తిని నువ్వు మోసం చేశావని మా దగ్గర ఫిర్యాదు వచ్చింది. ఆ వార్తను రాయకుండా ఉండాలంటే నాకు, అలాగే నా పేపర్‌లో క్రైమ్ రిపోర్టర్‌గా ఉన్న నిమ్మశెట్టి రాజుకి 30,000/ ఇవ్వాలి అంటూ డిమాండ్ చేశాడు. భయంతో మహిపాల్ 14–10–2025 సాయంత్రం 6:46 గంటలకు ఫోన్‌పే ద్వారా 10,000/ చెల్లించాడు. అయినప్పటికీ, మిగిలిన 20,000/ ఇవ్వాలని ఇద్దరూ మళ్లీ ఒత్తిడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వేములవాడ పట్టణ పోలీసులు కరుణాకర్ నిమ్మశెట్టి రాజుపై కేసు నమోదు చేశారు. తొగరి కరుణాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న నిమ్మశెట్టి రాజును కూడా పట్టుకుని శనివారం (25–10–2025) రిమాండ్‌కు పంపారు. ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ మాట్లాడుతూ, మీడియా ముసుగులో బెదిరింపులు, దోపిడీలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవు. ఇలాంటి బాధితులు వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇస్రాజ్ పల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏ డి ఈ పి. వరుణ్ కుమార్ పాల్గొని విద్యుత్ అధికారులతో కలిసి ముందుగా గ్రామంలో 100 కెవిఎ నూతన ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించి రైతులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని కెపాసిటర్లు వాడటం వలన నాణ్యమైన విద్యుత్ పొందగలుగుతారని వివరించారు .విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు సూచనలు చేశారు .ఐ ఎస్ ఐ మార్కు కలిగిన పంపు సెట్లు వాడాలని నాసిరకం వైర్లను వాడకుండా మంచి విద్యుత్ కొరకు ఐఎస్ఐ మార్క్ కలిగిన నాణ్యమైన విద్యుత్ వైర్ ని మాత్రమే వాడుకోవాలని సూచించారు .ఇనుప స్టార్టర్ బాక్స్ లకు బదులు ప్లాస్టిక్ స్టార్టర్స్ బాక్సులు బిగించుకోవాలని తెలియజేశారు .గ్రామంలో అర్హత కలిగిన లోడ్ 5 హెచ్ పి నుండి 7.5 హెచ్ పి సామర్థ్యంకు పెంచుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ఏ ఈ కె. రాకేష్ కుమార్ ,సబ్ ఇంజనీర్ ప్రవీణ్ ,ఎస్ ఎల్ ఐ వెంకటరమణ ,లైఫ్ ఇన్స్పెక్టర్ దుబ్బరాజం లైన్మెన్ లు ఏఎల్ఎం లు రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** పశువులకు రైతులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య ,పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి ప్రకాష్ సూచించారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో శనివారం పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు .ఈ వ్యాధి నివారణకు సంబంధించి పశువులకు సకాలంలో టీకాలు వేయించుకొని వ్యాధుల నుంచి రక్షించుకోవాలని సూచించారు .అలాగే వ్యాధి సోహిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చు అన్నారు .నాలుగు నెలలు పైబడిన ప్రతి పశువుకు టీకాలు వేయించుకోవాలని సూచించారు .కావున రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు .గ్రామంలో 250 కి పైగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండలం పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్ తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి ప్రకాష్ ,మండల పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్ ,పశు వైద్య సిబ్బంది వి ఎల్ ఓ రవీందర్,ఎల్ ఎస్ ఏ రాజశ్రీ,రవి,నిశాంత్,రమేష్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం /తంగళ్ళపల్లి :** తంగళ్ళపల్లి మండలం కస్బెకట్కూర్ గండిలచపేట ఓగులపూర్ గ్రామాలలో ఐకెపి మహిళా ఇందిరా క్రాంతి పథం ద్వారా ఈ రోజు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నేరల నరసింగం గౌడ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నరసింగం మాట్లాడుతూ ఇట్టి ఐకెపి కేంద్రాలలో రైతులు వడ్లను అమ్మకాలు చేయాలని చెపుతూ, రైతులు దళారుల ఉచ్చులో పడి ఆగం కావద్దని తెలుపడం జరిగింది. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్ టోనీ లింగాల భూపతి డైరెక్టర్ పొన్నాల పరుశురాం పాక్స్ డైరెక్టర్ దేవేందర్ పొన్నం లక్ష్మణ్ గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య రాజేశ్వర్ రావు పదిగే శ్రీను కొత్త రవి రమేష్ సాయి ఐకెపి సిబ్బంది మహిళలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కట్కం చైతన్య కుమారికి డాక్టరేట్

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ వాసి,కేయూ రాజనీతి శాస్త్ర పరిశోధకురాలు కట్కం చైతన్య కుమారి డాక్టరేట్ సాధించింది.ఈ మేరకు కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి కట్ల రాజేందర్ ప్రకటించారు. ఆచార్య వల్లూరి రామచంద్రం మార్గదర్శకత్వంలో చైతన్య కుమారి ప్రజావిధానంగిరిజన సంక్షేమం అంశంపై కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కార్యక్రమాల పరిశోధన పూర్తిచేశారు.డాక్టరేట్ సాధించిన చైతన్య కుమారిని విభాగ అధ్యాపకులు, సహ పరిశోధకులు అభినందించారు.

## మరోసారి మానవత్వం చాటుకున్న నిశాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని వెణుగుమట్ల గ్రామానికి చెందిన వోడ్నాల వినిత చిన్ననాడే తల్లిదండ్రులు ఇద్దర్ని కోల్పోయింది. తనకి తన నానమ్మ లక్ష్మి అన్ని తానై చూసింది.వినితకి ఈ నెల 30వ తేదీన పెళ్లి కుదరగా తన మనవరాలి పెళ్లి చేసే స్తోమత తన వద్ద లేకా దాతల కోసం ఎదురు చూస్తున్నారని విషయం తెలిసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి స్పందించి వినితకి గ్రామ పెద్దల సమక్షంలో 10,000 రూపాయలు తన సహాయంగా వివాహానికి అందచేయడం జరిగింది.

## కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ రైతులకు ఒరిగిందేమీ లేదు

**ప్రజాపక్షం/మల్లాపూర్:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నమ్ముకునేందుకు ప్రతి ఏట రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావని మొక్కజొన్న అన్నదాతలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ , మాజీ జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి లు అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో అకాల వర్షాలతో తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి రోజులు గడుస్తున్న నేటి వరకు మార్కెట్ యార్డ్ నుండి ఒక గింజను సైతం కొనుగోలు చేయకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. అకాల వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడిసి ముద్దాయితుందని, తేమశాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో మార్కెట్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అంటూ అన్నదాతల నడ్డి విరుస్తుందని, రైతులను హరిగోశ పెడుతూ కాలయాపన చేస్తుందని రైతులు ఆగ్రహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండావని హెచ్చరించారు. తక్షణమే మార్కెట్లోని ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని లేనియెడల ఒకటి రెండు రోజుల్లో రైతులతో కలిసి ధర్నా చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్యాల లక్ష్మణ్, మాజీ వైస్ ఎంపీపీ నగేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు లింగస్వామి, నాయకులు డీలర్ మల్లయ్య రామ్ రెడ్డి, లక్ష్మణ్, సిద్దయ్య, గంగారాజం,రైతులు ఉన్నారు.

# కరోనా కంటే ప్రమాదకరమైనవి డ్రగ్స్

**ప్రజాపక్షం/ముత్తారం :** కరోనా మహమ్మారి కంటే ప్రమాదకరమైనదనవి డ్రగ్స్ అని వాటిని నిర్మూలించకపోతే వ్యక్తిగతంగా, సమాజానికి తీరని నష్టం జరుగుతుందని మంథని రెండవ ఎస్సై సాగర్ అన్నారు. శనివారం మంథని పట్టణంలోని కాకతీయ హై స్కూల్ ఆధ్వర్యంలో కో కరికులర్ యాక్టివిటీలో భాగంగా డ్రగ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎస్సై డి.సాగర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఇలాంటి ఆలోచన రావడము చాలా అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పిల్లల్లో డ్రగ్స్ వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాంపై అవగాహన కల్పించాలన్నారు.ఇది కరోనా మహమ్మారి కంటే ప్రమాదకరమైనదని దీనిని నిర్మూలించకపోతే మానవ మనుగడకే ప్రమాదం ఉందన్నారు. డ్రగ్స్ ను నిర్మూలించడం పోలీసు శాఖ ఆధ్వర్యంలో మా వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల యువత చెడు దారి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, పావని, స్రవంతి పోలీసులు, పోలీసు అధికారులు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఇన్చార్జి పశు వైద్యాధికారి టి. రవి ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ పాడి పశువులలో వ్యాదులు ప్రభలుతున్న దృష్ట్యా పక్షం రోజూలపాటు జరుగనున్న 7వ విడత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం 10 రోజులపాటు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని.ఈ టీకాలను పశువులకు వేయించే విధంగా చూడాలని ప్రతి ఒక పాడి పశువుల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.4 నెలలు పైబడిన ప్రతి పశువుకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బందితోపాటు గోపాల మిత్రులు నరెడ్ల రాములు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## 30న రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ముత్తారం :** అక్టోబర్ 30న రాష్ట్ర వ్యాప్త బంద్ ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ కోరారు. మంథని ప్రజాసంఘాల కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం మండలాధ్యక్షుడు బందెల రాజ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోకుండా విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తుందని అన్నారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా విద్యా వ్యవస్థను న్యాసనం చేస్తుందని అన్నారు. గతంలో పెండింగ్స్ స్కాలర్షిప్ విడుదల చేస్తా అని చెప్పినటువంటి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి కూడా విడుదల చేయకుండా వారి జీవితాలతో ఆటలాడుతుందని విద్యార్థులు ఉన్నత చదువు చదువుకోలేకపోతున్నారని పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని చెప్పి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలని ఫీజు బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఫీజులను డిమాండ్ చేసి వసూలు చేస్తున్నటువంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్, ఆల్ ప్రొఫెషనల్, డిగ్రీ, పీజీ, విద్యాసంస్థల యూనివర్సిటీల రాష్ట్ర వ్యాప్త బంద్ జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సాయి తేజ, శ్రావణ్, పునీత్, శ్రీశాంత్ కుమార్,పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల హామీ అడుగంటి పోయింది



**ప్రజాపక్షం/సారంగాపూర్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ అడుగంటిపోయిందని జగిత్యాల జిల్లా మాజీ చైర్‌పర్సన్ దావా వసంత అన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారంగాపూర్ బీర్‌పూర్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం ఎమ్మెల్యే మానుకోవాలన్నారు. కోట్ల నిధులు తెస్తున్నామని చెప్పి, అభివృద్ధి ముసుగులో షాడో కాంట్రాక్టర్‌గా అవతారం ఎత్తారని సీనియర్ నేతలే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి కన్నా, కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిపై ఎమ్మెల్యే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులను పూర్తి చేయడం గెలిచిన ఎమ్మెల్యేలు, ప్రభుత్వం బాధ్యత అన్నారు. సారంగాపూర్ మండలం కోనాపూర్ బ్రిడ్జి 5కోట్ల 50లక్షలు మంజూరై, రెండేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని అన్నారు. నిధులు లేని ప్రభుత్వంలో ఉండి నిధులు ఎట్లా తెస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తేలు రాజు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సాగి సత్యం రావు, మండల ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, నాయకులు వొద్నాల జగన్, బైరి మల్లేశం, సంబారి గంగాధర్, జలంధర్, రామానుజం, భాస్కర్ నాయక్, సుమన్ నాయక్, లింగన్న, వంశీ, మర్రి గంగన్న, రాయమల్లు, శ్రీను, వంశీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు వినియోగించుకోవాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ కోరారు .శనివారం గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) గొల్లపల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ,బుగ్గారం తహసిల్దార్ ,సొసైటీ అధికారులు వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో కలిసి ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమా సంతోష్ మాట్లాడుతూ...రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని పండించిన ప్రతి గింజను నేరుగా కొనుగోలు ,చేస్తామని దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన రైతులకు సూచించారు .రైతుల సమిష్టి శ్రమకు సరైన విలువ లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం వరికి రూ. 2,389, సాధారణ రకానికి రూ. 2,369 మద్దతు ధరతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమం లో ఏఎంసీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, ప్యాక్స్ సీఈవో సుధాకర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్యాక్స్ సిబ్బంది ,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో ఈసీసీఈ డే కార్యక్రమాలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని దమన్నపేట ,చిల్వాకోడూర్,గోవిందపల్లి గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో ఈ కేంద్రాల్లో ఈ సీ సీ ఈ, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్లు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సీ సీ డే ప్రతి నెలలో నాల్గవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు మాట్లాడుతూ పిల్లలకు ఏమి కావాలి తల్లులకు ఏమి కావాలి ఎలాంటి ఆటలు నేర్పాలో వాటి గురించి తెలియజేశారు.పూర్వ ప్రాథమిక విద్య ,లేదా మాల్యారంభ దశ విద్య ఐసిడిఎస్ లో ,అతి ముఖ్యమైన భాగాలలో ఇది ఒకటి .ఈ విద్య యొక్క ముఖ్యమైన ఉద్దేశం పిల్లలకు ఆనందంగా ఆటపాటలతో కూడుకున్న కృత్యా దారిత కార్యక్రమాలను అందించి ప్రాథమిక పాఠశాలలో చేర్పించడానికి సంసిద్ధులను చేయడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు .పిల్లల సృజనాత్మక శక్తిని వ్యక్తీకరించే సామాజిక ఉద్యోగ మానసిక శారీరక అభివృద్ధి లను పెంపొందించడానికి పిల్లలు నేర్చుకునే అభ్యసించే విద్య అందించడం జరుగుతుందని తెలిపారు .ఈ ఈసీసీ డే రోజున తల్లిదండ్రులు అమ్మమ్మలు నానమ్మలు పాల్గొంటారని వారి ముందు పిల్లలు ఈ నెలలో చేసిన కార్యక్రమాలపై తల్లిదండ్రుల సమక్షంలో ప్రాక్టికల్ చేసి చూపిస్తామన్నారు .పాటలు కథలు ఆటలు సృజనాత్మక కార్యక్రమాలు ,అంకెల పరిచయం అక్షరాల పరిచయం చేయించడం జరుగుతుంది.మేధో వికాసం భాషాభివృద్ధి అందరితో కలిసిమెలిసి ఉండడం మొదలైన కార్యక్రమాలు పిల్లలకు ఉపయోగ పడుతున్నదని తల్లులకు అవగాహన కలిగించ నైనది ప్రైవేట్ పాఠశాలకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సైండ్ల రజిత ,సరోజ ,కందుకూరి విజయలక్ష్మి ,ఆయమ్మ లక్ష్మి తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

## జిల్లా ఇంఛార్జి కలెక్టర్‌కు రాజన్న ప్రసాదం అందజేసిన ఇఒ

**ప్రజాపక్షం/వేములవాడ :** జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గా అదనపు భాద్యతలు స్వీకరించిన గరీమా అగ్రవాల్ ను వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రసాదం అందజేసారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ ను ఈఓ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిని ఈఓ జిల్లా ఇంఛార్జి కలెక్టర్‌కు వివరించారు.

## నాగుల చవితి వేడుకలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ముత్తారం,అడవి శ్రీరాంపూర్, మచ్చుపేట, ఖమ్మంపల్లి,లక్కారం, ఓడేడ్ గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో శనివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగుల చవితి వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లోని పుట్టలో పాలు పోసి నాగులమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. పూజల ద్వారా కాలసర్ప దోషాలు తొలగడం, కుటుంబ సమస్యలు పరిష్కరమవుతాయని, సంతానం కలుగుతుందని భక్తులు ప్రగాఢ విశ్వాసంతో తెలిపారు. అలాగే ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలోని రెండో వార్డులో ఉన్న నాగులమ్మ దేవాలయంలో నాగులమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై వర్క్ షాప్ ప్రారంభం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై వర్క్ షాప్ ను ప్రారంభించారు. ఇందులో భాగంగా రాపిడ్ స్కిల్ సంస్థ యొక్క రిసోర్స్ పర్సన్ అమన్ ఎలుగం మాట్లాడుతూ కళాశాలలో అత్యున్నతమైన సౌకర్యాలు కల్పించబడ్డాయని కొనియాడారు. ఇటువంటి సౌకర్యాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం వల్ల వారి భవిష్యత్తు చాలా అత్యున్నతంగా ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఏ.నవీన్ కుమార్, డైరెక్టర్ నవత , ప్రిన్సిపల్ డాక్టర్ టి శ్రీనివాస్ ,అకౌంట్స్ ఆఫీసర్ పి పవన్ కుమార్ , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు, డాక్టర్ వి. శ్రీధర్, అనిల్, పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు

**ప్రజాపక్షం/వెల్గటూర్:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని పైడిపల్లి గ్రామంలో 82 (ఆవులు, ఎద్లు) 123 గేదెలకు ఉచితంగా గాలికుంటూ నివారణ టీకాలను వేయడం జరిగింది. ఈ సందర్భంగా పశువులపై వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది డాక్టర్ ప్రియ, సంధ్య ఎల్ఎస్ఏ, నాగరాజు వీఏ, నారాయణ వోయస్, రాంకుమార్ వోయస్, చంద్రయ్య వోయస్, అంజి, పైడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కూన సంతోష్, చేపూరి జనార్ధన్, భూమక్క, శంకర్, పర్వతాలు చిలుకయ్య, తిరుపతి, విజ్జగిరి తదితరులు పాల్గొన్నారు

## గౌసూర్ రెహమాన్‌కి సన్మానం

**ప్రజాపక్షం/కోరుట:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురలో వ్యక్తిగత పని నిమిత్తం 3 నెలలు అమెరికా పర్యటన ముగించుకొని తిరిగి శనివారం రోజు ప్రిన్సిపాల్ బాధ్యతలు స్వీకరించిన గౌసూర్ రెహమాన్ ని కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్‌యస్‌యస్ పివో గంగాప్రసాద్, అధ్యాపకులు ఇమ్రాన్‌ఖాన్, నటరాజన్, హబీబ్, శ్రీనివాస్, సంజీవ్, డింగరి ప్రశాంత్, వంశీ, రాజు, శిరీష, మొబద్ , సుబ్రమణ్యం, షేక ఫాతిమా, సంధ్య, స్వరూప, వసుధ, షాహిద్, సాధిక్, ఫిరోజ్ , బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మైనారిటీ పాఠశాలల లక్ష్యం అంతర్జాతీయ స్థాయి విద్య

## సొసైటీ కార్యదర్శి బి. షఫీ ఉల్లా




**ప్రజాపక్షం / జైనూర్ :** అంతర్జాతీయ స్థాయి విద్య అందించడమే మైనారిటీ గురుకుల పాఠశాలల లక్ష్యం అని రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీ ఉల్లా అన్నారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ఉన్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్య బోధన, వసతులను ఆయన పరిశీలించారు. నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 205 పాఠశాలలో విద్యార్థులకు ఈ విద్య అందించడం జరుగుతోందన్నారు. మైనారిటీ పాఠశాలలో చదివి ఆసిఫాబాద్ జిల్లా నుండి ఎనిమిది మంది ఎంబిబిఎస్ లో సీటు దక్కించుకోవడం అభినందనీయమని తెలిపారు. ఇటీవల ఎంబిబిఎస్ లో సీటు దక్కించుకున్న ఇక్రమొద్దీన్, అంజద్ లను ఆయన శాలువా కప్పి సన్మానించారు.

### మైనారిటీల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్ జిల్లాలో మైనారిటీల సమస్యలు పరిష్కరించాలని సన్‌రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ జమీల్ కోరారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీ ఉల్లాకు వినతి పత్రం అందజేశారు. జైనూర్ లో ఉన్న ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలను ఉన్నతీకరిస్తూ పదవ తరగతి అందుబాటులో ఉండేలా చూడాలని, ముస్లిం మైనారిటీలలో బిసి కేటగిరీకి చెందిన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చూడాలని, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నదీమ్ అహ్మద్, నాయకులు సయ్యద్ అబుతాలి, ముంతాజ్ బియబాని, ఫాజిల్ బియబాని, మాజీ కోఆప్షన్ సభ్యుడు పేరోజ్ ఖాన్, జిల్లా మాజీ కోఆప్షన్ అబ్బు తలిబ్, సయ్యద్ అసద్ అలీ, మౌలాన మెహరాజ్, షేక్ రహీం, షేక్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే నేరాలు తగ్గుతాయి

## ఎస్ఐ మధుకర్



**ప్రజాపక్షం / కేరమేరి :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం కేరమేరి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మధుకర్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కేరమేరి జూనియర్ కాలేజ్ విద్యార్థులకు పోలీస్ సిబ్బంది విధులు, స్టేషన్ కార్యకలాపాలను పరిచయం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ పోలీసులు సమాజ శాంతి భద్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని, ప్రజల సహకారం ఉన్నప్పుడు సమాజంలో నేరాలు తగ్గుతాయి అని అన్నారు. పోలీస్ వ్యవస్థలోని రికార్డులు, విధులు, కేసు దర్యాప్తు విధానాలు, సామాజిక భద్రతా చర్యల గురించి విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపడి చదివితే విజయం

## సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ వెంకటాచారి



**ప్రజా పక్షం/ రెబ్బెన :** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, అలా చదివితే విజయం ఖచ్చితంగా వరిస్తుందని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రెటరీ వెంకటాచారి అన్నారు. శనివారం ఆయన రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటాచారి విద్యార్థులు, పాఠశాలలో ఉన్న వసతులు, వార్షిక ఫలితాల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులను స్టేజిపై భయం లేకుండా మాట్లాడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశలో 7, 8, 9, 10 తరగతుల విద్య ప్రధానమని అన్నారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి మాత్రమే కాకుండా ప్రతి అం శంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. 10వ తరగతిలో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అంతకుముందు జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఇంచార్జి జిఎం మచ్చగిరి నరేందర్ అధికారులతో కలిసి ఆయనను సన్మానించారు. ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, డిజిఎం (సివిల్) ఎస్.కె. మదీనా బాషా, కరస్పాండెంట్ మండల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఉపాధ్యాయుడు ఆర్ల రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కార్మిక నాయకుడికే ఇవ్వాలి



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని ఐఎన్‌టియుసి సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్యకు కేటాయించాలని ఐఎన్‌టియుసి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలో ఐఎన్‌టియుసి సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాష్ రావు, బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంపల్లి సమ్మయ్య శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలో కార్మిక వర్గంలో మంచి పట్టు ఉన్న నాయకుడని, జిల్లా ప్రజలతో కలిసిమెలసి ఉంటారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ఆయన ఎనలేని కృషి చేశారని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డు అందుకున్నారని వివరించారు. రానున్న ఏ ఎన్నికల్లోనైనా సింగరేణి కార్మిక వర్గం ఓట్లే కీలకం అవుతాయని, కాంగ్రెస్ పార్టీ జిల్లాలో పటిష్టంగా ఉండాలంటే కార్మిక నాయకుడైన మందమర్రి నివాసి కాంపల్లి సమ్మయ్యకు మంచిర్యాల జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ని కోరుతున్నట్లు వారు తెలిపారు. యూనియన్ ఏరియా కార్యదర్శి బూర శ్రీనివాస్, సోకల శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణ, గట్టయ్య, ఆర్గనైజర్, మీడియా ఇంచార్జ్ వామన్ కుమార్, వినయ్ కుమార్, పిట్ కార్యదర్శులు భాస్కరాచారి, తిరుపతి, రవి కుమార్, ఉమా దేవి, అసిస్టెంట్ కార్యదర్శులు గుమాస ప్రభాకర్,శ్రీకాంత్, యూనిస్ పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

## సిఐ కుమారస్వామి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** గుడుంబా తయారీ మరియు విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కాగజ్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగజ్ నగర్ మండలంలోని తుంగమడుగు గ్రామంలో శనివారం డిఎస్‌పి వహిదుద్దీన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ కుమారస్వామి మాట్లాడుతూ గుడుంబా వంటి మత్తు పదార్థాల వల్ల యువత నిర్వీర్యం అవుతుందని, దీని కారణంగా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. గుడుంబా తయారీ, విక్రయాల గురించి ఏమైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కాటన్ సెర్చ్‌లో 20 లీటర్ల గుడుంబా, 30 కిలోల బెల్లం, 3 వేల లీటర్ల గుడుంబా వాష్ పట్టుబడినట్లు తెలిపారు.

# డిసిసి అధ్యక్షుడిగా కాంపల్లి సమ్మయ్యకు ప్రాధాన్యతనివ్వాలి



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపికలో పార్టీ అధ్యక్షుడిగా కాంపల్లి సమ్మయ్యకు ప్రాధాన్యత కల్పించాలని ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. శనివారం ఆయన నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏరియా బ్రాంచ్ ఐఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బో ర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ సారథ్యంలో కాంపల్లి సమ్మయ్య గత దశాబ్దకాలంగా మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, ఐఎన్‌టియుసి యూనియన్ లో క్రియాశీలంగా కొనసాగుతూ ప్రజలకు, కార్మికులకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని తెలిపారు. బూత్ స్థాయి నుండి మండల, బ్లాక్ స్థాయి వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన ఆయన జిల్లాలోని ప్రజలలో పట్టు ఉండి, అన్ని వర్గాలతో సత్సంబంధాలు కలిగిన నాయకుడిగా మంచి పేరును సంపాదించారని పేర్కొన్నారు. జిల్లా డిసిసి అధ్యక్ష పదవికి ఆయనను ప్రతిపాదించాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పరిశీలకులను అభ్యర్థించారు. సిహెచ్ భీమ్ రావు, కలవేణ శ్యామ్, గరిగ స్వామి, తిరుపతి రాజు, కేంద్ర నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, చాట్ల అశోక్, లేగల శ్రీనివాస్, ఆర్. గోపాల్ రెడ్డి, జీవన్ రావు, మనోజ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బాసర ఉపాధ్యాయుని విధుల నుంచి తొలగించాలి..టిజివిపీ

**ప్రజాపక్షం/బైంసా :** బాసర మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం ఏంటని రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ బైంసా టీజీవిపి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు.బాసర ఒడిలో ఇలాంటి పనులు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. అలాంటి వ్యక్తిపై వెంటనే చర్యలు చేపట్టాలని, మరో ఉపాధ్యాయుడు ఇలాంటి పనులు చేయకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# కేంద్రం రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని నిరసన దీక్ష



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్:** స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్స్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తు జాతీయ బిసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గాంధీ పార్కులో గాంధి విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరస దీక్షలో బిసి హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ, దేశానికి ప్రధానిని బిసిని చేసినం అని గొప్పుగా చెప్పుకుంటున్న బిజెపిప్రభుత్వం బిసిల న్యాయమైన డిమాండ్ బిసి ఆకాంక్షలు, బిసిల ప్రజాస్వామిక వాటకై ఉద్యమాలు నడుస్తున్నప్పటికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పెడచెవిన పెట్టడం బాధాకరం అన్నారు. ఏ ఉద్యమం లేకుండానే అగ్రకులాలకు ఇడబ్ల్యుఎస్ పేరుతో రాజ్యాంగంలో ఆర్టికల్ 103ను ఐదు రోజుల్లో సవరణ చేసి పది శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్రం బిసిల పక్షపాతి అని చెప్పుకుంటున్నప్పటికి బిసిల న్యాయమైన వాటికై రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చి బిసిల పక్షాన నిలబడాలని కోరకుంటున్నామని చెప్పారు. లేకుంటే బిసి సమాజం ముందు బిజెపి ని ఈ విషయంలో దోషిగా నిలబెడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి పోరాట సమితి అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్ణ శ్రీధర్, రాష్ట్ర నాయకుడు గజ్జల వెంకటయ్య, శాకాపురి బీమ్సేన్, సంపరి వేణుగోపాల్, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నేనెలా నరసయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు చెలగాని సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు,క్రమశిక్షణ,సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్




**ప్రజాపక్షం/బైంసా :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల బైంసా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వాటోలి గ్రామంలో తేదీ 25 అక్టోబర్ 2025 నుండి తేదీ 31 అక్టోబర్ 2025 వరకు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అంటేనే సామాజిక సేవ అంకిత భావం క్రమశిక్షణ నిస్వార్థ సేవ అన్నది ముఖ్య ఉద్దేశమని,నాకోసం కాదు మీకోసం అన్న నినాదంతో స్వచ్ఛందంగా వాలంటీర్లు వివిధ గ్రామాలకు వెళ్లి సేవ చేయడమనేటువంటిది అభినందనీయమని తెలిపారు.కనుగొంటూ,వారిలో వివిధ అంశాల ద్వారా గ్రామాలలో అవగాహన కల్పించడం అనేది ప్రశంసించదగిన విషయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య, మాట్లాడుతూ కళాశాల విద్యార్థులలో క్రమశిక్షణతో పాటు క్యాంపస్ టు విలేజ్ అన్న నినాదంతో గ్రామ చైతన్యంలో భాగంగా ఈ వాటోలి గ్రామాన్ని ఎన్నుకొని గ్రామంలో విద్యార్థుల సేవలు ఏ విధంగా అవసరము అని తెలుసుకొని స్వచ్ఛభారత్ తో పాటు నాటడం,సర్వే ద్వారా గ్రామంలో యువతలో చైతన్యం కలిగిస్తూ ఉద్యోగ ఉపాధి రంగాల్లో చైతన్యాన్ని కలిగిస్తూ ప్లాస్టిక్ నివారణతో పాటు నీ ఏడు రోజులలో ప్రతి రోజు మధ్యాహ్నం వివిధ అత్యున్నత డాక్టర్లును మోటివేషన్ స్పీకర్లను అలాగే యోదగా ఇన్స్పెక్టర్లను లీగల్ అవేర్నెస్ను లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాల్ని చేపట్టడం జరుగుతుందని అలాగే వివిధ సాంస్కృతిక అంశాలలో చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు అరె రాజు డాక్టర్ ఓం ప్రకాష్,వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్,అలాగే సీపీడీసీ ప్రెసిడెంట్ డాక్టర్ నగేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్,బాజీరావు పాటిల్, మనోజ్ గ్రామ మాజీ సర్పంచ్ సచిన్ ఇంకా అధ్యాపకులు డా.భీమ్రావు డా.పిజిరెడ్డి యు. రవికుమార్ డా. శంకర్ గుంత సుధాకర్ డా.సంతోష్ కుమార్,డా.నహెదా,డా.కల్పన,దివ్య రామ్మోహన్ సురేందర్,ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యార్థిని,విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు,మొక్కజోన్న కొనుగోళ్ల పై దృష్టి : మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్ /లక్ష్మణ్ చందా:** బండల ఖానాపూర్ లో సిసీ రోడ్లు డైనేజీల నిర్మాణానికి భూమిపూజ మామడ మండలం బండల ఖానాపూర్ గ్రామంలో బీజేఎల్పీ నేత,ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ చేశారు.సీఆర్ఆర్ గ్రాంట్స్ నుండి రూ.25 లక్షల నిధులతో ఈ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ,నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,నాయకులు మేడిసెమ్మ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్,జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర రాజారెడ్డి,నాయకులు బాపు రెడ్డి, మం డల అధ్యక్షుడు రంజిత్,నాయకులు సాహెబ్‌రావ్, జా లంసింగ్,గోవర్ధన్ రెడ్డి,ధర్మన్న,అశ్విన్‌రెడ్డి,సూరి, రిత్విక్, భూమేష్, ఎల్లయ్య,రాజేశ్వర్,సురేష్ తోపాటు మండల నాయకులు,కార్యకర్తలు,అధికారులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

లక్ష్మణచందా మండల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మునిపెల్లి శివారులోని మొక్కజొన్న కల్లాలను పరిశీలించారు.అకాల వర్షాలు సంభవిస్తున్న దృష్ట్యా,మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా, కల్లాల వద్దే కొనుగోలు ప్రక్రియ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు



.ఎమ్మెల్యే చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,నాయకులు రమేష్, ముత్యం రెడ్డి,బాపు రెడ్డి,శ్రీధర్ రెడ్డి,ఓస రాజు,లక్ష్మణ్ వేణు, జమాల్,అర్జున్ తో పాటు మండల నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# ప్రతి వికలాంగులకు యూడిఐడి కార్డులు అందించేలా చర్యలు

## సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** అర్హులైన ప్రతి వికలాంగులకు యూడిఐడి కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు.శనివారం ఆమె అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో యూడిఐడి కార్డుల మంజూరపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సెర్ఫ్ సీఈవో మాట్లాడుతూ,వికలాంగుల ధృవీకరణ కోసం చేపట్టే శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాల్సిందిగా సూచించారు.శిబిరాలు నిర్వహించే ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు,వికలాంగులకు తగిన సౌకర్యాల ఏర్పాటుకు జిల్లా వారీగా రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించానట్లు తెలిపారు.ఈ నిధులను సమర్థంగా వినియోగించి వికలాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.అర్హులైన ప్రతి వికలాంగునికి ధ్రువీకరణ పత్రం అందేలా చర్యలు తీసుకోవాలని,దీని ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు వారికి సులభంగా అందుతాయని వివరించారు.జిల్లాల వారీగా జరుగుతున్న శిబిరాల వివరాలు,హాజరైన వికలాంగుల సంఖ్య తదితర అంశాలపై అదనపు కలెక్టర్లతో సమీక్ష జరిపారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు శిబిరాలను స్వయంగా పర్యవేక్షించాలని,స్లాట్ బుక్ చేసుకున్న ప్రతి వికలాంగునికి శిబిర వివరాలు ముందస్తుగా తెలియజేయాలని ఆదేశించారు.ఇందుకోసం స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లాలో వికలాంగుల ధ్రువీకరణ శిబిరాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నెలకు సుమారు 12 శిబిరాలు నిర్వహిస్తున్నామని,ఇప్పటివరకు 960 యూడిఐడి కార్డులు అర్హులకు అందజేసినట్లు తెలిపారు.దశలవారీగా అర్హులైన



ప్రతి వికలాంగునికి కార్డులు అందించే చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.వికలాంగులందరూ శిబిరాలకు హాజరయ్యేలా గ్రామీణాభివృద్ధి, సంక్షేమ ,వైద్య,ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి సంస్థ,సంక్షేమ శాఖ,వైద్య శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాను పకడ్బందిగా సిద్ధం చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఎస్ఐఆర్(స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) ఓటర్ల జాబితాను ఖచ్చితత్వంతో,పకడ్బందిగా సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులు ఆదేశించారు.శనివారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి,జిల్లా కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ,2002 లో రూపొందించిన ఎస్ఐఆర్ జాబితాను 2025 ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన సూచించారు.ఎస్ఐఆర్2002,ఎస్ఎస్ఆర్ 2025 లింకేజీ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారుల సహకారంతో క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ చేపట్టాలని అన్నారు 2002 తర్వాత కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను భౌతికంగా మరోసారి ధృవీకరించాలని ఆయన సూచించారు.డిప్యూటీ తహసిల్దారులు,బిఎల్ఓ సూపర్వైజర్లతో నిరంతం స మీక్షా సమావేశాలు నిర్వహించాలని,ప్రతిరోజు లక్ష్యాలను నిర్ణయించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పద్ధతిగా అమలు చేయాలని సూచించారు.కేటగిరీఏలోని వివరాలను నిర్ధారించి'సి',డి' కేటగిరీ వివరాలతో అనుసంధానం చేయాలన్నారు.ఈవీడియో కాన్ఫరెన్స్‌ల అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్,బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సర్ఫరాజ్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో రభస

## తహసీల్దార్ తీరుపై కాంగ్రెస్ నాయకుల మండిపాటు



**ప్రజాపక్షం / హాజీపూర్ :** మండల కేంద్రంలో శనివారం జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రభస జరిగింది. చెక్కుల పంపిణీ గురించి స్థానిక తహసీల్దార్ తమకు సమాచారం ఇవ్వలేదంటూ కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని 36 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ పంపిణీ విషయం ఎవరికీ తెలియజేయక పోవడంపై నాయకులు తహసీల్దార్ వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు.

### తహసీల్దార్ తీరుపై విమర్శలు

స్థానిక తహసీల్దార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిలా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలలో కూడా తహసీల్దార్ తలదూర్చుతున్నారని విమర్శించారు. గత పది ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడిన తమకు మండలంలో కనీస గుర్తింపు లేకుండా చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ తమ పనులు పక్కన పెట్టి, పార్టీ కార్యక్రమాలలో ఆదాయం వచ్చే విషయాలలో తలదూర్చి లబ్ది పొందే ప్రయత్నాలు చేస్తున్నట్లు నాయకులు ఆరోపించారు. ఈ విషయమై పార్టీ అధిష్టానం దృష్టి సారించాలని వారు కోరారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించే ప్రయత్నాలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

# పారిశుద్ధ్యంపై నిరంతరం పర్యవేక్షణ : ఈఓ అన్వర్ అలీ



**ప్రజాపక్షం/ముధోల్ :** పారిధుధ్యంపై ప్రత్యేక దృష్టితో నిరంతరం పనులను పర్యావేక్షిస్తున్నామని ముధోల్ గ్రామ పంచాయతీ ఈఓ అన్వర్ అలీ అన్నారు.శనివారం పారిశుధ్యం లో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పలు కాలనీల్లో నెలకొన్న పిచ్చి మొక్కలను తొలగించామని తెలిపారు.ముఖ్యంగా మురికి కాలువల్లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు,చెత్తను తీసి తరలించడం,నీటి సమస్యల పరిష్కారం,ఇంటింటికి వెళ్తూ చెత్త సేకరించడం గ్రామంలోని ఆయా వీధుల్లో విద్యుత్ బల్బులను అమర్చడం నిరంతరంగా సాగుతోందని పేర్కొన్నారు.అదేవిధంగా కార్యాలయంలో సైతం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామన్నారు.వీటితో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు సలహాలు,సూచనలు అందిస్తున్నామని తెలిపారు.గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సోయా పంటను వెంటనే కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/బైంసా :** సోయా పంటను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.రాజు డిమాండ్ చేశారు.శనివారం బైంసా మండల తాహసిల్దార్ కి వినతి పత్రం సమర్పించారు. బైంసా డివిజన్ వ్యాప్తంగా లక్ష ఎకరాల కంటే పైన ఈ ఖరీఫ్ సీజన్లో సోయా పంటను రైతాంగం పండించిందని,పండించే సమయంలో కురిసిన విపరీతమైన వర్షాలతో సోయా పంటకు తీవ్రమైన నష్టం జరిగి దిగుబడి కూడా విపరీతంగా తగ్గిందని అన్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఎం.ఎస్.పి 5328 రూపాయలు ఉండగా మార్కెట్లో ప్రైవేట్ కొనుగోలుదారులు 4000 నుండి 4,500 చెల్లిస్తూ రైతులను దోచుకుంటున్నారని,క్వింటల్ కు వెయ్యి రూపాయలు రైతులు నష్టపోతున్నారని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని డిమాండ్ చేశారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా తయారు చేయాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పకడ్బందిగా తయారు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కు మార్ తెలిపారు. శని వారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధి కారులు, రిటర్నింగ్ అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. నిర్వహణ కోసం చేప ట్టిన ప్రిపరేటరీ కార్యాచరణలో పురోగతి ఉండాలని, 2002 లో చేసిన ఎస్ఐఆర్. తో 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియపై బూత్ స్థాయి అధికారుల చేస్తున్న ప్రక్రియను రిటర్నింగ్ అధి కారులు పర్యవేక్షణ చేస్తూ వేగవంతంగా పూర్తి చేయా లన్నారు. ఎస్ఐఆర్ నిర్వహణ కంటే ముందు ప్రతి పోలింగ్ కేంద్రం స్థాయిలో 2002 ఎస్.ఐ.ఆర్. డేటాను 2025 ఎస్ఐఆర్ డేటాతో పరిశీలన చేయా లని,ఈ రెండు జాబితాలలో కామన్ గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన



వారి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ధృవీక రించాల్సి ఉంటుందని అన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ, ఎస్ఐ ఆర్ మ్యాపింగ్‌లో భాగంగా క్యాటగిరి ఏ ని బి.ఎల్.ఓ. యాప్ ద్వారా ధృవీకరిస్తామని, క్యాటగిరి సి, డి లింక్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ.ఆర్.ఓ. కార్యా లయంలో ప్రత్యేకంగా బూత్ స్థాయి అధికారులను కేటాయించి త్వరిత గతిన మ్యాపింగ్ పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రెవెన్యూ డివిజన్ అధికారి రవి, తహ సిల్దార్ శ్రీనివాసు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు కోర్టులో విముక్తి



**ప్రజాపక్షం/బోధన్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో విధులను సైతం లెక్క చేయకుండా పోరాడిన బోధన్ ఆర్టీసీ కార్మికు లపై కేసులు పెట్టారు. ఈ నేపథ్యంలో 12సం వత్సరాల నుంచి కోర్టు చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఆర్టీ సీ కార్మికులపై ఉన్న కేసులను ఎత్తివేస్తూ కోర్టు తీర్పును ఇచ్చింది. ఈ కేసును సీనియర్ న్యా యవాది వెంకటేశ్వరరావు దేశాయి వాదించి గెలిచారు. న్యాయవాదిగా సహకారం అందిం చిన వెంకటేశ్వర రావు దేశాయి కి, సహాయ సహకారాలు అందించిన చిట్టెపు కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సత్కరించారు. కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సాధనలో చేసిన ఉద్యమ కృషిని కార్మికులు గుర్తు చేసుకున్నారు. అనేక సంవత్సరాల పాటు ఇబ్బందులు ఎదుర్కొనప్ప టికీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న సంద ర్భంగా సంతోషంగా ఉందని, ఆర్టీసీ కార్మి కులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు తదితరులు ఉన్నారు.

## త్తమ జర్నలిస్టుగా సోక్కం తిరుపతికి సన్మానం




**ప్రజాపక్షం/ఆర్మూర్ :** రాష్ట్రస్థాయి ఉత్తమ విలేకరిగా ఎంపికై అవార్డు పొందిన సోక్కం తిరుపతికి నవనాథపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పార్దేం సంజీవ్ కార్యదర్శి తమ్మి వినోద్ ఆధ్వ ర్యంలో ప్రెస్‌క్లబ్ భవనంలో ఘనంగా సన్మా నించారు. సంజీవ్ మాట్లాడుతూ సీనియర్ రిపోర్టర్‌గా ఉన్న తిరుపతికి ప్రజల సమస్య లతో పాటు అక్రమాలు అవినీతి అక్రమాలపై చక్కటి వార్తలు రాశారన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ జర్నలిస్టుగా ఎంపికైనందుకు ప్రెస్‌క్లబ్ లోని సభ్యులు అభినందించారు.

## ఇందిరమ్మ ఇంళ్ల నిర్మాణాలు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలి

### జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో పలువురు ఎంపీడీవోలు,హౌసింగ్ అధికారు లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష సమా వేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆయా మండలాలవారిగా ఆయా దశల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటిక ప్పుడు పూర్తి చేస్తూ ఉండా లని చెప్పారు.అనుమతులు లభించిన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం ప్రారం భించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలి పారు.ఇండ్ల నిర్మాణ పను



లను ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాల న్నారు.ఇండ్ల నిర్మాణానికి ఇసుక,ఇతర ముడి పదార్థాల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.దశ లవారీగా నిర్మాణ పనులు సంబంధిత అప్లికేషన్‌లో పొందుపరుస్తూ ఉండాలని తెలిపారు.హౌసింగ్ అధికా రులు,ఎంపీడీవోలు,ఇతర అధికారులు, పాల్గొన్నారు.

## బాల్య వివాహ నిరోధక చట్టంపై అధికారులకు శిక్షణ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** బాల్య వివాహ నిరోధక చట్టంపై గ్రామ, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మహిళా శిశు సంక్షేమ శాఖ బా లల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం రోజు నిజా మాబాద్ జిల్లా మోర్తాడ్ ఎంపీడీవో కార్యాలయంలో పంచా యతీ కార్యదర్శులకు ఐసిడిఎస్ సూపర్ వైజర్‌లకు బాల్య వివాహం నిరోధక చట్టంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్ శిక్షణ ఇవ్వడం జరిగింది. శిక్ష ణలో భాగంగా 2006లో బాల్య వివాహ నిషేద చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిందని ఈ చట్టం ప్రకారం బాలు డికి వయస్సు 21సంవత్సరాలు బాలికకు వయస్సు 18సం వత్సరాలు నిండకుండా వివాహం జరిగితే అది ఈ చట్టం ప్రకారం నేరం అవుతుందన్నారు. అలాగే బాల్య వివాహం చేసుకుంటే ఈ చట్టం కింద రెండు సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయాల వరకు జరిమానా లేదా రెండు శిక్షలను విధించవచ్చున్నారు. ఇది బెయిల్ లభించని నేరమని, బాల్య వివాహం జరిపిన, బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన గాని ఇదే రకమైన శిక్షలు విధించబడతాయని తెలిపారు. 2006బాల్య వివాహ నిరోధక చట్టం 16వ సెక్షన్ ప్రకారం ప్రభుత్వం బాల్య వివాహాల నిషేద అధికారులను నియ మించడం జరిగిందని, బాల్య వివాహాలు జరగకుండా చర్య లు తీసుకోవడానికి అధికారాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకో వడానికి అధికారాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. బాల్య వివాహ నిరోధక అధికారులుగా చర్యలు తీసుకోవ




డానికి అధికారాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. బా ల్య వివాహ నిరోధక అధికారులుగా గ్రామస్థాయిలో పంచా యతీ సెక్రెటరీ, మండల స్థాయిలో తహసీల్దార్, సూపర్ వై జర్(ఐసిడిఎస్), ప్రాజెక్ట్ స్థాయిలో సిడిపివో లు, డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఉంటారని, అలాగే బాల్య వివాహం జరుగుచు న్నచో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నంబర్ ఫోన్ చేయా లని, అనంతరం తహసీల్దార్ సత్యనారాయణ మాట్లా డుతూ.. బాల్య వివాహం వల్ల సామాజికంగా, ఆర్థికంగా శారీరకంగా మానసికంగా ఎదుగుదల తగ్గిపోయి, అన్ని రకాల అభివృద్ధికి నోచుకోరని, బాల్య వివాహాల వల్ల తల్లి బిడ్డలు ఇద్దరికీ ప్రమాదకరమని, చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల మాతా శిశు మరణాలు పెరుగుతాయని తెలి పారు. బాల్య వివాహాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీ డీవో తిరుమల, సూపర్ వైజర్ ఐసిడిఎస్ మంజుల, కౌన్సి లర్ జమ్రుద్, మోర్తాడ్, మండల పంచాయతీ కార్యద ర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సులపై ఆర్టీఓ అధికారులు తనిఖీలు చేపట్టాలి : సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రైవేట్ బస్సులపై ఆర్టీఓ అధికారులు తని ఖీలు చేపట్టాలని సీపీఐ పక్షాన డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కార్యా లయంలో విలేకరుల నిర్వహించి సుధాకర్ మాట్లాడారు. గత రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలో జరిగిన రోఘ రోడ్డు ప్రమా దంలో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రక



టించాలన్నారు. జిల్లాలో మహారాష్ట్రకు వెళుతున్న ప్రైవేట్ బస్సులు ఇతర ప్రాంతాలకు వెళుతున్న బస్సులు అదేవిధంగా స్కూల్ బస్సులను ఆర్టీ అధికారులు ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్‌లను నిత్యం తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

## కళ్యాణ లక్ష్మి,షాదీ ముభారక్,చెక్కులు పంపిణీ

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/తానూర్ :** మండల కేంద్రంలోని రైతువేదికలో శని వారం ఆయా గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ,షాదీ ముభారక్ (61)చెక్కులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,ముఖ్య అతిథిగా పాల్గొన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పేదింటి అడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతోనే కల్యాణలక్ష్మి ,షాదీముబారక్,పథకాలను ప్రవేశపెట్టిందని అయన అన్నారు.పేదల సంక్షేమానికి కేంద్రం ప్రభు త్వం,అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని,అన్నారు .కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ శనగ విత్తనాలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని,రైతు వేదిక నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత,పోషకాహార మిషన్ (ఎన్ఎఫ్ఎ స్ఎం) లోభాగంగా యూసంగి పంట కోసం సబ్సిడీపై శనగ ఎన్ బి ఈజీ 47 వెరైటీ విత్తనాలు పంపిణీ ఆయన ప్రారంభించారు.ఈ కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్,పిఎసిఎస్సీ చైర్మన్ నారాయణరావు పటేల్,అగ్రికల్చర్ ఏడిఏ శ్రీనివాసరాజు,తాసిల్దార్ మహేందర్ నాథ్,అగ్రికల్చర్ ఏవో మనిషా,బిజెపి మండల అధ్యక్షుడు లక్ష్మ ణ్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్ మౌలా ఖాన్,బిజెపి నాయకులు చిన్న రెడ్డి,శివాజీ రావు పటేల్,దేవిదాస్ పటేల్,బండారే సోమనాథ్,మాజీ సర్పంపలు,గోపా సాయినాథ్,సంతోష్ పటేల్,బిజెపి నాయ కులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేదారేశ్వర ఆశ్రమంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కేదారేశ్వర ఆశ్రమంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఉంటుందని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. మోతిబిందు ఉన్న వారికి హైదరాబాద్‌లో శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేస్తారని వారు తెలిపారు. ఉచితంగానే భోజన వసతి, బస్సు సౌకర్యం ఉంటుందని ఆసక్తి ఉన్న వారు ఈ శిబిరానికి రావాలని కోరారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి




**ప్రజాపక్షం/బోధన్:** పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువ లేని వని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మ రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోధన్ పట్టణంలోని ఆచాన్ పల్లి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు పట్టణ సిఐ వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్ర మంలో బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు, రుద్రూర్ సిఐ కృష్ణ, ఎస్సై లు మచ్చేందర్ రెడ్డి, చంద్ర మోహన్, సునీల్, సాయన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** మండలంలోని అర్గుల్ గ్రామంలోని పిఏ సిఎస్ సొసైటీ వరి కొనుగోలు కేంద్రాన్ని రికార్డులను పరిశీలించారు. ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఎమ్మార్వో కిరణ్మాయి, డీటీ సివిల్ సప్లయి ప్రవీన్‌కుమార్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# పొరపాట్లు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష నిర్వహించి సీఈఓ మాట్లాడారు. 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరిలుగా విభజించటం జరిగిందని తెలిపారు. ఇందులో కేటగిరి ఎ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు కేటగిరి బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో కాబడిన వారు, కేటగిరి సిలో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు కేటగిరి డి లో 20022007 మధ్యలో జన్మించిన వారిగా విభజించగం జరిగిందని తెలిపారు. అన్ని కేటగిరిలు కలిపి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మ్యాపింగ్ చేయటం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఎ జాబితాను బిఎల్‌ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని తద్వారా ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా పోర్టల్‌లో నమోదు చేయబడుతుందని తెలిపారు. అనంతరం కేటగిరి సి, కేటగిరి డి లలోని ఓటర్లను కేగిరి ఎ కు మ్యాపింగ్ చేయాలని ఈ ప్రక్రియను ఎఈఆర్‌ఓ ల ఆధ్వర్యంలో బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు బిఎల్‌ఓ యాప్ ద్వారా వచ్చే శనివారం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ బిఎల్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్‌వైజర్లకు శిక్షణనివ్వటం జరుగుతుందని, మొదట కేటగిరి ఏ ఓటర్ల జాబితాను బిఎల్‌ఓ యాప్ ద్వారా నిర్ధారించిన తర్వాత కేటగిరి సి, డిలను కేటగిరి ఎ కు లింక్ చేయటం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా దశల వారిగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 50 శాతం మ్యాపింగ్ పూర్తయిందన్నారు.

# సమాజ రక్షణ పోలీసుల కర్తవ్యం



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** సమాజ పరిరక్షణ, ప్రజా రక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్క పోలీస్ పని చేస్తారని అల్లాదుర్గం సర్కిల్ సిఐ రేణుక రెడ్డి తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం లో భాగంగా శనివారం సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది సిఐ ఆధ్వర్యంలో అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ నుండి ఐబి చౌరస్తా వరకు 2 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రేణుక రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మనకు మరువలేని జ్ఞాపకాలని సమాజ సేవలో పగలు రాత్రి తేడా లేకుండా శాంతి భద్రతలను కాపాడుతూ అవసరమైతే ప్రజారక్షణ కోసం ప్రాణ త్యాగం చేయడానికి కూడా వెనుకాడరని కొనియాడారు. సంఘ విద్రోహ శక్తుల ను ఎదిరించి ఎందరో పోలీసులు వీరమరణం చెందారని వారి త్యాగాలు వెలకట్టలేనివని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట్, రేగోడు ఎస్సైలు శంకర్, ప్రవీణ్ రెడ్డి, రమేష్, పోచయ్య తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరాక్‌లో ఆలూర్‌వాసి దుర్మరణం

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండల కేంద్రానికి చెందిన కుర్మె చిన్న రాజేష్(45) గురువారం ఇరాక్‌లో దురదృష్టవశాత్తు మరణించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు కష్టంగా ఉండటంతో జీవనోపాధి కోసం కొన్ని సంవత్సరాల క్రితం ఇరాక్‌కు వెళ్లిన రాజేష్ అక్కడ కూలీగా పని చేస్తున్నారు. అయితే అనుకోకుండా మృతి చెందారు. ఆయనకు ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటన తెలిసిన వెంటనే గ్రామంలో శోకసంద్రం అలుముకుంది. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించే చర్యలు తీసుకోవాలని ఆలూర్ కల్లెం భోజారెడ్డి నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కోరగా వెంటనే స్పందించిన వినయ్ రెడ్డి ఇరాక్ ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. స్థానికులు ప్రభుత్వం రాజేష్ కుటుంబానికి తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆలూర్ ప్రజలు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది

ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించిన సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఇటీవల విధి నిర్వహణలో వీరమరణం పొందిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని కుటుంబానికి రావల్సిన ఉద్యోగ విషయమై కలెక్టర్, సీపీలతో మాట్లాడారు. అనంతరం ఆ కుటుంబానికి మెరుగైన వైద్యమందేలా ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌తో మాట్లాడారు.విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు చేస్తూ పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. పరామర్శించిన వారిలో నుడా చైర్మన్ కేశ వేణు, నాగేష్‌రెడ్డి, నరాల రత్నాకర్ ఉన్నారు.

# కల్తీ కల్లు పై ఎక్సైజ్ అధికారులు దాడులు

ముగ్గురుపై కేసు నమోదు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండలం లోని పలు గ్రామాలలో శనివారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిల్వర్ హైవేపై నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై కల్తీ కల్లు విక్రయాలు నిర్వహిస్తున్న సత్యనారాయణ గౌడ్, ప్రభాకర్, మహేష్ గౌడ్ పై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. కల్తీ కల్లు విక్రయిస్తూ ఎక్సైజ్ చట్టానికి విరుద్ధంగా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 115 లీటర్ల కల్తీకల్లును పారబోశారు. ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

# కర్నూల్ వద్ద బస్సు ప్రమాదానికి కారణమైన వారిని శిక్షించాలి




**ప్రజాపక్షం/ఆర్మూర్ :** హైదరాబాద్ నుండి బెంగళూరు వెళుతున్న ప్రైవేట్ బస్సు ప్రమాదానికి కారణమైన వారి కఠినంగా శిక్షించి బస్సులో సజీవ దహనమైన కుటుంబాలకు బస్సు యాజమాన్యం నుండి కోటి రూపాయలు నష్టపరిహారం ఇప్పించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లాభాలు తప్ప ప్రయాణీకుల జాగ్రత్త, భద్రత విస్మరిస్తున్న ప్రైవేట్ బస్సు యజమానుల పట్ల ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ బస్సు యాజమాన్యం నిర్దిష్టంగా నిబంధనలు పాటించే టట్లు షరతులు విధించాలని లేనిచో వారి బస్సులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అబ్దుల్, బాలయ్య, వర్జారెడ్డి, పోశెట్టి, రాజేష్, నరేందర్, లక్ష్మణ్, సుధాకర్ పాల్గొన్నారు.

# విద్యార్థిని మృతి పట్ల సంతాపం



**ప్రజాపక్షం/బాల్కొండ :** మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని గడ్డం లక్షిత ఇటీవల కుక్క దాడిలో గాయపడింది. గాయంతో ఉన్న విద్యార్థిని గడ్డం లక్షిత తీవ్ర అనారోగ్యం కావటంతో చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు శుక్రవారం ప్రైవేట్ ఆస్పత్రిలోకి తరలించగా శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని గడ్డం లక్షిత (5వ తరగతి 10సంగలు) మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో చదువుతుంది. శనివారం పాఠశాల ఆవరణ లో మృతి చెందిన విద్యార్థిని గడ్డం లక్షిత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# హనుమాన్ ఆలయాలలో చందన అలంకరణ అన్నదానం

**ప్రజాపక్షం/కొడిపల్లి :** మండల పరిధిలోని వెల్మకన్న గ్రామంలోని బాలవీర హనుమాన్ ఆలయం వద్ద శనివారం పురస్కరించుకుని ఆలయ పూజారి మెట్టు రాములు శర్మ ఉదయం పంచామృత అభిషేకం, చందనలంకరణ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ముప్పిడి శ్రీనివాస్ గౌడ్ దూల్ పేట్ ఎన్నారై లండన్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల పరిధి కంచనపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పట్లోరి ఫౌండేషన్ బాలకిషన్ రావు తిరుపతిరావు, లింబాద్రి రావు కుటుంబ సభ్యులు ఎన్ఆర్ఐ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొట్టాల గ్రామ వీర హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి గచ్చిబౌలి వెంకటరెడ్డి హైదరాబాద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు రాములు శర్మ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు, దాతలకు ఆశీర్వచనాలు అందజేసి భగవత్ కార్యక్రమాల్లో అందరు భాగస్వాములు కావాలన్నారు. భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ఆయా గ్రామాల భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలింపు

డీసీఎం ను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు



**ప్రజాపక్షం/కొల్చారం:** మెదక్ నుండి సంగారెడ్డి జిల్లా చౌటకూర్ గ్రామమునకు అక్రమంగా డీసీఎం వ్యాన్ లో తరలిస్తున్న సుమారు 370 బస్తా (19 టన్నులు) రేషన్ బియ్యంను టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంబడించి కొల్చారం మండలం లోని ఏడుపాయల టీ జంక్షన్ వద్ద శనివారం ఉదయం పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా డ్రైవర్ ప్రవర్తన అనుమానంగా ఉండడంతో తనిఖీ చేయగా 370 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. పట్టుబడిన రేషన్ బియ్యం డీసీఎం వ్యాన్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు కొల్చారం పోలీసులకు అప్పగించారు. కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.